క్లుప్తంగా

ఘనంగా తిరువీధి



శేషవాహనంపై వేంకటేశ్వర స్వామిని ఊరేగిస్తున్న భక్తులు

నరసన్నపేట: వేంకటేశ్వర స్వామి వారిని శనివారం అశ్వ వాహనంపై నరసన్నపేట పురవీధుల్లో ఊరేగారు. స్థానిక వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి మూడో రోజు ఈ విధంగా ఊరేగారు. ఆలయ ట్రస్టీ సభ్యులు పి.కృష్ణప్రసాద్‌తోపాటు ఆలయ అర్చకుడు సాయి కృష్ణమాచార్యులు, సత్యవరాగ్రహారానికి చెందిన పండితుడు మావుదూరి జగదీష్ బాబు, తదితరులు పాల్గొన్నారు. వీధుల్లో భక్తులు దారి పొడవునా స్వామివారికి నీరాజనాలు పలికారు. ర్యాలీలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ధర్మాన కృష్ణదాస్

పోలాకి: గంగివలసలో కేధారేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట శనివారం ఘనంగా నిర్వహించారు. మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ ప్రత్యేక పూజలు చేశారు. హోమంలో పాల్గొని స్వామివారి తొలిదర్శనం చేసుకున్నారు. వేదపండితుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. ముద్దాడ భైరాగినాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, యువజన విభాగం అధ్యక్షుడు రెంటికోట త్రినాథరావు, సర్పంచ్‌లు బంకా చక్రధర్, కణితి సత్తిబాబు, చింతు రామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

19న ఆలయ భూముల వేలం

పాతపట్నం: ఈ నెల 19వ తేదీన మండలంలోని అంగారసింగి గ్రామంలో ఉన్న జగన్నాథ, రాధాకాంత స్వామి దేవస్థానం భూములు (39.53 ఎకరాలు) మూడేళ్లకు (2025–2028) బహిరంగ వేలం వేయనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ టి.వాసుదేవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఆలయం వద్ద వేలం ఉంటుందన్నారు. వేలంలో పాల్గొనేవారు రూ.500 ప్రథమ ధరావత్తు చెల్లించాలన్నారు. హెచ్చు పాట పాడుకున్న వారు ఒక సంవత్సరం మక్తా అడ్వాన్స్ చెల్లించాలని ఈఓ తెలిపారు.


ప్రజల సహకారంతోనే సారా నిర్మూలన సాధ్యం



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

పాతపట్నం: ప్రజల సహకారంతోనే సారా నిర్మూలన సాధ్యమవుతుందని పాతపట్నం ఎక్సైజ్ ఎస్ఐ బి.శ్రీనివాసరావు అన్నారు. నవోదయం–2.0లో భాగంగా మండలంలోని ప్రహరాజపాలెం గ్రామాల్లో సారా నిర్మూలనపై శనివారం అవగాహన కల్పించారు. సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. మహిళా పోలీసు ప్రసన్న, ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం



గ్రామసభ నిర్వహిస్తున్న సీఐ కిరణ్ మణీశ్వరి

కొత్తూరు: మండలంలోని కారిగూడ గిరిజన పంచాయతీ పరిధిలోని ఎగువ దొండమానుగూడ, దిగువ దొండమానుగూడ, చింతమానుగూడ గిరిజన గ్రామాలను సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి తీర్మానించినట్లు స్థానిక ఎక్సైజ్ సీఐ కిరణ్‌మణీశ్వరి తెలిపారు. నవోదయం–2.0లో భాగంగా శనివారం కారిగూడలో సర్పంచ్ సవర లోది అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఇకనుంచి ఈ మూడు గ్రామాల్లో సారా అమ్మకాలు, రవాణా, సారా వంట చేయడం మానుకోవడం జరుగుతుందని తీర్మానించారు. పంచాయతీ దత్తత ఆఫీసర్ ఆమదాలవలస ఎక్సైజ్ సీఐ సతీష్, వీఆర్వో భాస్కరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

కొత్తూరు: రానున్న ఖరీఫ్‌లో ప్రకృతి వ్యవసాయం సాగు విస్తీర్ణం పెంచాలని రైతులకు ప్రకృతి వ్యవసాయం ఎంటీ సూర్యనారాయణ సూచించారు. మండలంలోని పారాపురంలో ప్రకృతి సాగుపై రైతులతో కలిసి శనివారం ర్యాలీ నిర్వహించారు. నవధాన్యాల సాగు చేయడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. నవధాన్యాల సాగు కిట్లును రైతులకు పంపిణీ చేశారు. గత ఖరీఫ్‌లో ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో సాగు చేసిన ఆదర్శ రైతు కుంచాల తవిటినాయుడుతోపాటు మరో రైతును సత్కరించారు. సర్పంచ్ కుంచాల రత్నాలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులు



కంబకాయలో ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

- మెరుగైన ఉత్తీర్ణతే లక్ష్యం
- పదో తరగతి గట్టెక్కించేందుకు ప్రత్యేక తరగతులు
- సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గతంతో పోల్చితే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాలు నిరాశాజనకంగా వచ్చాయి. అనేకమంది విద్యార్థులు ఒక్కో సబ్జెక్టులో ఫెయిల్ అయ్యారు. మరికొందరు రెండు, మూడు సబ్జెక్టుల్లో తప్పిపోయారు. ఇటువంటి విద్యార్థులను పదో తరగతిలో పాస్ చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు పలు స్కూళ్లకు అవకాశం ఉంది. ఆయా స్కూళ్లలో వచ్చే విద్యా సంవత్సరంలో మరింతగా ప్రవేశాలు ఉండవచ్చని ఉపాధ్యాయ వర్గాలు భావిస్తున్నాయి. నరసన్నపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు వేసవి సెలవుల్లో కూడా స్కూళ్లకు వెళ్లి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఎంఈఓలు కూడా బాధ్యతగా ఉపాధ్యాయులకు తగిన సూచనలు చేస్తూ ప్రోత్సహిస్తున్నారు. నియోజకవర్గంలో 378 మంది విద్యార్థులు ఫెయిల్ కాగా.. వీరికి ప్రత్యేక తరగతులు జరుగుతున్నాయి.

నరసన్నపేట నియోజకవర్గంలో పదో తరగది ఫెయిలైన విద్యార్థుల వివరాలు..

మండలం	మొత్తం విద్యార్థులు	పాస్ అయినవారు	ఫెయిలైన వారు
నరసన్నపేట	683	522	159
జలుమూరు	457	392	67
పోలాకి	532	394	74
సారవకోట	451	378	78

సబ్జెక్టుల వారీగా..

ఈ నెల 19 తేదీ నుంచి పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. 9 రోజులే సమయం ఉండటంతో ఉపాధ్యాయులు మరింతగా దృష్టి పెట్టారు. గత నెల 25 నుంచి ఉన్నత పాఠశాలల్లో రోజుకో సబ్జెక్టు చొప్పున ఉపాధ్యాయులు తరగతులు నిర్వహిస్తున్నారు. గణితం, సైన్స్, ఇంగ్లిషు సబ్జెక్టులో ఎక్కువ మంది విద్యార్థులు పరీక్షలు తప్పారు. ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి ఉత్తీర్ణులయ్యేలా ప్రణాళిక ప్రకారం చదివిస్తున్నారు. కొందరు విద్యార్థులు ప్రత్యేక తరగతులకు రాకుండా మొండికేస్తుంటే ఉపాధ్యాయులు వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో సంప్రదించి తీసుకు వస్తున్నారు.

వేసవి సెలవులు కోల్పోతున్న ఉపాధ్యాయులు..

సప్లిమెంటరీ శిక్షణ పేరుతో విద్యాశాఖ ఉపాధ్యాయులకు బాధ్యత అప్పగించడంతో ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు వేసవి సెలవులు కోల్పోతున్నారు. ఉపాధ్యాయులకు వేసవి సెలవులు లేకుండా చేస్తే జీఓ నంబరు–35 ప్రకారం ప్రత్యామ్నాయ సెలవులు ఇవ్వాలని పలువురు ఉపాధ్యాయులు కోరుతున్నారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



మా స్కూల్లో 145 మంది విద్యార్థులకు 43 మంది ఫెయిల్ అయ్యారు. వారందరూ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకుంటన్నాం. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. మంచి ఫలితాలు వస్తాయని భావిస్తున్నాం.

– పైడి వెంకటరావు, హెచ్‌ఎం, నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల

ప్రత్యామ్నాయ సెలువులు ఇవ్వాలి



వేసవి సెలవుల్లో ప్రత్యేక తరగతుల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయ సెలవులు ఇవ్వాలి. జీఓ నంబరు 35ను తప్పకుండా పాటించాలి. ప్రస్తుతం పనిచేస్తున్నవారికి తగిన సెలవులు మంజూరు చేయాలి. ఈ అంశంపై విద్యాశాఖ అధికారులకు నివేదిస్తాం.

– బి.కేశవరావు, ఏపీటీఎఫ్(1938), నరసన్నపేట మండల అధ్యక్షుడు

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం



మండలంలో 159 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. 13 ఉన్నత పాఠశాలల్లో.. తొమ్మిది చోట్ల సింగల్ డిజిటోలోనే విద్యార్థులు తప్పారు. ఆయా పాఠశాలల్లో శతశాతం ఉత్తీర్ణత వచ్చే అవకాశం ఉంది. మిగిలిన స్కూళ్లల్లో కూడా ఉపాధ్యాయులు బాధ్యతగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉత్తీర్ణత శాతం బాగా మెరుగుపడుతుంది.

– పి.దాలినాయుడు, ఎంఈఓ, నరసన్నపేట

ఆలయ భూములను పరిరక్షించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఆలయ ట్రస్టీ చైర్మన్ మధురెడ్డి

పొందూరు: సాలిహుండాం వేణుగోపాలస్వామి ఆలయ భూములను పరిరక్షించాలని ఆలయ ట్రస్టీ చైర్మన్ మధురెడ్డి ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను కోరారు. ఈ మేరకు శనివారం మండలంలోని పెనుబర్తిలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందించారు. ఎన్నో ఏళ్లగా ఆయల భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని, రెవెన్యూ యంత్రాంగానికి విన్నవించుకుంటున్నా పట్టించుకోవటం లేదన్నారు. పాస్‌బుక్‌లు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకుంటున్నా పట్టించుకోలేదన్నారు. దేవునికి ఏవిధమైన ఆదాయం చేకూరటం లేదని, దూప, దీప, నైవేద్యాలకు సైతం సిస్తులు కట్టేందుకు ఆక్రమణదారులు ముందుకు రావటం లేదన్నారు. పొందూరు మండలంలో సాలిహుండాం భూములకు సంబంధించి సుమారు 8 ఎకరాల 50 సెంట్లు ఆక్రమణలో ఉందన్నారు.బాడాన గిరి, తదితరులు ఉన్నారు.

భూముల రికార్డులు సరిచేసుకోండి...

ఏవైనా ప్రభుత్వ భూములు ప్రైవేటు భూములుగా, ప్రైవేటు భూములు ప్రభుత్వ భూములుగా నమోదై ఉంటే సరిచేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించందని ఎమ్మెల్యే తెలిపారు. చెరువులు, గోర్జులు, ప్రభుత్వ భూములు, జిరాయితీ, తదితర భూముల వివరాలు తప్పుగా నమోదై ఉంటే సరిచేసుకునేందుకు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్వాతంత్ర్య సమర యోధులుకు, మాజీ సైనికులకు ప్రభుత్వం పట్టాలిచ్చి పది ఏళ్లు దాటితే వారికి, వారి కుటుంబ సభ్యులుకు దక్కేందుకు 22–ఏ నుంచి తొలగించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. పలు గ్రామాల్లో గ్రామకంఠాలను ప్రభుత్వ భూములుగా నమోదు చేశారని, వాటిని కూడా తొలగించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

విగ్రహ ప్రతిష్ట

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ పంచాయతీ పరిధి మహసింగి సమీపంలో వందలాది ఏళ్ల చరిత్ర గల వరహా నరసింహస్వామి ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమం శనివారం ఘనంగా ముగిసింది. ఆలయ ప్రధాన అర్చకుడు బాలకృష్ణ, పండితుల వేద మంత్రాల మధ్య పునఃప్రతిష్ట, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధి గోగులు వరప్రసాదరావు, సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌నాయుడు, పడాల లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



ఉమామహేశ్వర ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నరసన్నపేట: మండల కేంద్రంలో శనిత్రయోదశి సందర్భంగా శనీశ్వర ఆలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి భక్తులు శనీశ్వర ఆలయాల వద్ద బారులు తీరారు. సంతపేటలోని మల్లికార్జున స్వామి, ఉమామహేశ్వర, చొక్కలింగేశ్వర, మడపాం ఆంజనేయ స్వామి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కాలువ లోపల భాగంలో విడిచిపెట్టిన మట్టి

ఇవేం పనులు!

హిరమండలం: ఫలితం లేని పని చేసినా ఒక్కటే.. చేయకున్నా ఒక్కటే అన్నచందంగా ఉంది వంశధార కుడి ప్రధాన కాలువలో పూడికతీత. ఉపాధి పథకం ద్వారా వంశధార కుడి ప్రధాన కాలువలో ఇటీవల పూడికతీత పనులు చేపట్టారు. మట్టిని గట్టుపైకి వేయకుండా కాలువ లోపలే గట్టుకు అనుసరించి విడిచిపెట్టారు. ఇదే మట్టి చిన్నపాటి వర్షం కురిస్తే కాలువలోకే తిరిగి మట్టిపడి పూర్వ స్థితికి చేరుకుంటుంది. కాలువలోకి నీరు విడిచిపెట్టినా పూడిక కాలువలోనే ఉంటుంది. ఇటువంటి పనులు చేపట్టడం వల్ల ప్రయోజనం ఉండదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఈ పనులను సక్రమంగా చేపట్టేలా ఆదేశాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

స్త్రీశక్తి భవనం పూర్తయ్యేది ఎప్పుడో?

- 14 ఏళ్లుగా నిర్మాణ దశలోనే భవనం
- ఎమ్మెల్యే పరిశీలించి ఏడు నెలలు అవుతున్నా ఎలాంటి చర్యల్లేవు..



అసంపూర్తిగా ఉన్న స్త్రీశక్తి భవనం

ఎల్.ఎన్.పేట: మండల కేంద్రంలో చేపట్టిన స్త్రీశక్తి భవన నిర్మాణం పనులు ఎప్పటికి పూర్తవుతాయో అని పాలకులు, అధికారులను స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఈ భవనాన్ని గతేడాది అక్టోబర్‌లో పరిశీలించారు. అయినప్పటికీ పనుల్లో ఎలాంటి చలనం లేకుండా పోయింది. 2011లో స్త్రీ శక్తి భవన నిర్మాణానికి రూ.25 లక్షల నిధులు మంజూరుచేశారు. ఈ భవనం పూర్తయితే మహిళా సంఘాలకు సంబంధించిన సమావేశాల నిర్వహణ, ఇతర పాలనా పరమైన అంశాలను కొనసాగించేందుకు ఉపయోగపడనుంది. ఉపాధి పథకం సిబ్బంది ఉండేందుకు భవనం నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. 2011లో పాతపట్నం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన అప్పటి మంత్రి శత్రుచర్ల విజయరామరాజు ఈ భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. పునాది, గోడల నిర్మాణ స్థాయిలోనే కొన్నేళ్లపాటు కాంట్రాక్టర్ వదిలేశాడు. బిల్లు తీసుకున్న తరువాత పనులు చేయలేనని చేతులెత్తేయడంతో ఇంజినీరింగు అధికారులు మరో కాంట్రాక్టర్‌తో పనులు ప్రారంభించారు. రూ.25 లక్షలతో ప్రారంభించిన పనులు అంచెలంచెలుగా జరగడంతో ఎడతెగని కాలయాపన జరుగుతోంది. నిధులు సరిపోవని ప్రభుత్వానికి నివేదించడంతో 2017లో మరో రూ.7లక్షలు అదనంగా మంజూరు చేశారు. భవన నిర్మాణానికి మొత్తంగా రూ.32 లక్షలయ్యాయి. అయినా గత 14 ఏళ్లుగా పూర్తి కాలేదు. ఏడాదిలో నిర్మాణ పనులు పూర్తిచేయాల్సి ఉండగా.. అధికారులు ఎందుకు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తిచేయించేందుకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

రచ్చబండ ధ్వంసంపై ఫిర్యాదు

జలుమూరు: రావిపాడు పంచాయతీ పరిధి ఏనేటి కొత్తూరులో రచ్చబండ ధ్వంసంపై ఆన్‌లైన్‌లో ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు మాజీ ఎంపీటీసీ బోర సింహాచలం శనివారం తెలిపారు. ఏనేటికొత్తూరులో 30 ఏళ్ల క్రితం నిర్మాణం చేపట్టిన రచ్చబండను గ్రామానికి చెందిన బగ్గు దాలయ్య, బగ్గు జగన్నాథం, బగ్గు మల్లేష్, శాంతారావు, సత్యం, సింహాచలం ఎటువంటి అనుమతులు లేకుండా గురువారం రాత్రి ధ్వంసం చేశారన్నారు. వారి స్వంత అవసరాల కోసం రచ్చబండను ఒకవైపు పూర్తిగా తీసి ప్లాస్టింగ్ చేశారన్నారు. దీనిపై స్థానిక అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కనీసం స్వీకరించలేదన్నారు. రచ్చబండను దౌర్జన్యంగా కూలగొట్టి వారి ఇళ్లకు అనుకూలంగా మార్గం ఏర్పాటు చేసుకున్నారన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

12న ఆలయ హుండీ లెక్కింపు

పాతపట్నం: ఈ నెల 12వ తేదీన మండల కేంద్రంలోని నీలమణిదుర్గ ఆలయ హుండీని లెక్కించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ టి.వాసుదేవరావు శనివారం తెలిపారు. దేవదాయశాఖ, ఆలయ అర్చకులు, భక్తుల సమక్షంలో ఉదయం పది గంటల నుంచి లెక్కింపు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల భక్తులు డ్రెస్ కోడ్ పాటించాలని హాజరుకావాలని ఈఓ కోరారు.

తాగునీరు సరఫరా..



హడ్కో కాలనీలో నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలో తాగునీటి సమస్యను అధిగమించేందుకు పంచాయతీ సిబ్బంది ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. దేవాది వద్ద బోర్లలో గ్రౌండ్ వాటర్ లెవెల్స్ తగ్గడంతో నీటి సరఫరాకు ఇబ్బంది అవుతుంది. రెండు రోజుల క్రితం సాంకేతిక సమస్యలతో నీటి సరఫరాలో ఇబ్బందులు రాగా వాటిని పరిష్కరించారు. తాగునీరు అందకపోవడంతో పలు వీధుల నుంచి ప్రజలు మంచినీటి కోసం అవస్థలు పడుతున్నారు. శనివారం పలు వీధుల్లో ట్యాంకుల ద్వారా పంపిణీ చేశారు. మరో రెండు మోటార్లు సిద్ధం చేస్తున్నామని, అప్పటికీ నీటి సరఫరాలో మెరుగు కనిపించకపోతే ట్యాంకుల ద్వారా నిరంతరంగా నీటిని సరఫరా చేస్తామని ఈఓ ద్రాక్షాయిని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు. ట్యాంకుల ద్వారా సరఫరా చేసే నీరు కేవలం తాగడానికేనని వినియోగించాలన్నారు.

మురుగుతో అవస్థలు..



ఆమదాలవలస మున్సిపాలిటీ 21వ వార్డు కుద్దిరాం ఎస్సీ కాలనీలో గల కాలువల్లో మురుగు పేరుకుపోయింది. దుర్వాసనలతోపాటు దోమల బెడదతో రోగాలబారిన పడుతున్నామని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. పారిశుద్ధ్య పనుల నిర్వహణకు మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది ఎవరూ రావడం లేదన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కాలువల్లో పూడికలు తీయించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

– ఆమదాలవలస

రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టాలి



ఆమదాలవలస మున్సిపాలిటీలోని రెండో వార్డు కృష్ణాపురం, 14వ వార్డు బజె నాయుడు కాలనీ, 22వ వార్డు వెంకయ్యపేట, 23వ వార్డు లక్ష్మడిపేట గ్రామాలను కలుపుతూ గతంలో వేసిన రింగ్ రోడ్ దశాబ్దాలు గడుస్తూ మట్టి రోడ్డుగానే ఉంది. ఈ రహదారి గుండా నిత్యం వందల సంఖ్యలో వాహనదారులు ప్రయాణిస్తుంటారు. ఆమదాలవలస ప్రధాన రహదారి, పాలకొండ రోడ్డును కూడా ఈ రహదారే కలుపుతుంది. పాలకులు, అధికారులు చర్యలు చేపట్టడంలేదని ఆయా వార్డుల ప్రజలు వాపోతున్నారు. ఈ రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

– ఆమదాలవలస

ప్రమాదకరంగా..



పాతపట్నం మండలంలోని టెక్కలి–తెంబూరు రహదారి నుంచి సింగుపురం గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న గుమ్మగెడ్డపై నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారింది. బెర్మలు కోతకు గురికాండంతో ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. వంతెన ఇరువైపులా రక్షణ గోడలు కూలిపోయాయి. సింగుపురం, గురండి, మీదుగా ధనుపురం వరకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారిలో వరి, చెరుకు వంటి పంటలను బండ్లు, ట్రాక్టర్లపై తరలిస్తుంటారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి వంతెన నిర్మాణం చేట్టాలని ప్రజలు కోరుతున్నారు.

– పాతపట్నం

ప్రమాదకర మలుపు



కొత్తూరు మండలంలో మాతల–రుగడ రోడ్డులో మాతల జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద మలుపు ప్రమాదకరంగా ఉంది. ఈ మలుపు వద్ద ప్రాథమిక, ఉన్నత పాఠశాలతోపాటు అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఈ మలుపు వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

– కొత్తూరు

ఉచితం పేరుతో ఇసుక వ్యాపారం

- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: రాష్ట్ర ప్రభుత్వం ఇసుక ఉచితం అని చెపుతుంటే పాతపట్నం నియోజకవర్గం కొత్తూరు మండలం ఆకులతంపర వద్ద వంశధార నది రేవు నుంచి ఇసుక వ్యాపారం అధికార పార్టీ నాయకులకు కాసులు కురిపిస్తోందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలు పక్కన పెట్టి ఇసుక వ్యాపారం చేస్తున్నారని, వీరిపైన అధికారులు కూడా చర్యలు తీసుకోలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వంశధార నదిలో జేసీబీ, ప్రొక్లయినర్ వంటి యంత్రాలను దించి లారీలతో ఇసుక అమ్ముకుంటున్నారన్నారు. కొత్తూరు మండలంలో ఇసుక మాఫియా రోజురోజుకూ పెరిగిపోతుందన్నారు. రాత్రీ, పగలు తేడా లేకుండా ఇసుక అక్రమ వ్యాపారం జరుగుతున్నా.. రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అనుచరులే ఇసుక దందాను కొనసాగిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయన్నారు. పర్యావరణాన్ని, వంశధార ప్రవాహ దిశను మార్చేలా నదీ గర్భాన్ని కొల్లగొడుతున్నారన్నారు. రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులు సంయుక్తంగా దాడులు చేసి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.